





# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

మంగళవారం। 05 ఆగస్టు 2025

పేజీలు 8


శ్రీ గురు రాఘవేంద్రుడి 354వ

# సప్తరాత్రోత్సవాలు



మాట్లాడుతున్న మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

- ధ్వజారోహణతో సప్తరాత్రోత్సవాలు ప్రారంభం
- టీటీడీ వస్త్రాలు సమర్పణ
- ఆగస్టు 8 నుండి 14 వరకు
- 11న శ్రీ రాఘవేంద్రుడి మధ్యారాధన
- 12న మహారథోత్సవం
- యోగేంద్ర మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు
- విశేష సేవలందించిన వారికి శ్రీ గురు రాఘవేంద్ర అనుగ్రహ ప్రసస్తి అవార్డులు
- శ్రీ మఠం పీఠాధిపతులు సుబుదేంద్రతీర్థులు

2లో

అంతర్జాతీయ విజిటల్ లీడర్‌షిప్‌కు

# అమెరికాకు వినూషారెడ్డి

- భారత్ నుండి ఎంపికైన ఏకైక మహిళా ప్రతినిధి
- ఈ నెల 11 నుండి 30 వరకు ఐవిఎల్‌పి సమావేశాలు
- అభినందించిన టీజీ.వెంకటేష్, భాజాపా నేతలు

2లో



డాక్టర్ వినూష రెడ్డి

15 నుండి మహిళలకు

# ఉచిత బస్సు ప్రయాణం



- మహిళల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** మహిళల సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటోందని కుట్టు మిషన్ల శిక్షణ పూర్తి చేసుకుంటున్న మహిళలతో పరిశ్రమలు వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ తెలియజేశారు. ఈ నెల 15వ తేది నుండి మహిళలకు ఉచిత బస్ సర్వీస్ ప్రారంబి, స్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కర్నూలు కెవిఆర్ కళాశాల ప్రాంగణంలో మహిళలకు ఏప్రిల్ 15న ప్రారంభించబడిన కుట్టు మిషన్ల శిక్షణ మరికొద్ది రోజులలో 100 రోజులు పూర్తి చేసుకోనున్న సందర్భంగా మహిళలు మంత్రిని ఆహ్వానించారు. వారుఏర్పాటుచేసిన సమావేశాన్ని ఉద్దేశించి మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మహిళా అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. ఇందులో భాగంగానే తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి చదువుల నిమిత్తం ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకొని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని మంత్రి తెలిపారు. ధృడ సంకల్పంతో కష్టపడితే మీ భర్త, మీ పిల్లలకంటే ఎక్కువ సంపాదించే అవకాశం ఉందని, మహిళలు ఈశిక్షణను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే మీకు బొమ్మలు తయారు చేసే నైపుణ్యాన్ని కూడా అందించే చర్యలు చేపడుతామని తెలిపారు.మీకు ఇచ్చే శిక్షణతో మీకు ఇతర కంపెనీలతో అనుసంధానం చేయించి మీ నైపుణ్యానికి తగ్గ ఫలితం వచ్చేలాగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలకు ఇంత మంచి సౌకర్యం,శిక్షణ కల్పించిన నా సొంత టీంకు, బీసీ కార్పొరేషన్‌కు

మిగతా 2లో

అధిక ఆదాయం కలిగించే ఆయిల్‌పామ్ పంటను

# సాగు చేయండి

- జిల్లాకు నిర్దేశించిన ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను పూర్తి చేయాలి
- ప్రతికూల వాతావరణంలో కూడా రైతులను ఆదుకొనే పంట ఆయిల్ పామ్
- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

6లో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

దేవాలయాల పై దాడులకు పాల్పడ్డ వారిని

# అరెస్టు చేయకపోతే ఉద్యమం

- కఠినంగా శిక్షించకపోతే అక్టోబర్ 2 నుండి ఆందోళనలు
- రాయలసీమ డిక్లరేషన్‌కు భాజాపా కట్టుబడి ఉంది..
- అమెరికా కంటే మన ప్రజాస్వామ్యమే గొప్పది
- భాజాపా సీనియర్ నేత,రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ.వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న టీజీ.వెంకటేష్,భాజాపా నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** రాష్ట్రంలో వైకాపా పాలనలో దేవాలయాలపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయని, ఆలయాలను ధ్వంసం చేశారని, దుశ్చర్యలకు పాల్పడ్డ వారిని గుర్తించి వెంటనేఅరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని భాజపా సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు టి.జి.వెంకటేష్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

మిగతా 2లో

భూ సమస్యల పై

# ప్రత్యేక దృష్టి సారించండి

- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా
- నీడ్‌బెస్డ్,డిస్కృన్సి సర్వే వేగవంతం చేయండి
- ఆత్మకూరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న నంద్యాల జిల్లా కలెక్టర్



2లో

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

సూర్య www.suryaa.com

మంగళవారం | 05 ఆగస్టు 2025

# 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని మంత్రి తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బేసిక్ టైలరింగ్ శిక్షణ పథకం కు బిసి, ఈబీసీ మహిళలను ఎంచుకోవడం జరిగిందని కర్నూలు జిల్లాలో 3440 మంది మహిళల కి శిక్షణ ఇస్తున్నామని, శిక్షణ కు 75% రోజులు హాజరైన మహిళలకు టైలర్ మోడల్ కుట్టు మిషన్ ఉచితంగా ఇవ్వబడుతుందని, అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కోర్సులో ప్రవేశం కల్పించే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ సందర్భంగా వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు మహిళలకు అన్ని విధాల మంచి జరిగే చర్యలు తీసుకుంటున్నారని భవిష్యత్తులో స్కూలు పిల్లల యూనిఫారంలు కుట్టే ఆర్డర్లు శిక్షణ పొందిన మహిళలకు వచ్చే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సతీష్ రెడ్డి, కోఆర్డినేటర్ ప్రభావతిఇన్‌స్ట్రక్టర్ రజని ఈ కార్యక్రమం గురించి ప్రసంగించారు. అనంతరం మహిళలు మంత్రికి సన్మానం చేసి మంత్రిచే కేక్ కట్ చేయించారు. ఈ సమావేశానికి బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సతీష్ రెడ్డి, కార్పొరేటర్ పరమేష్, ప్రభావతి, రజని మహిళలు పాల్గొన్నారు.

**CHANGE OF RELIGION**

"I, TALARI SURESH, S/O **TALARI VIJAYA KUMAR,** #7-589, Narasapuram, Rudravaram, VTC: Muthaloor, PO: Muthalur, Sub District: Rudravaram, District: Kurnool, Andhra Pradesh, PIN: 518543 do hereby solemnly affirm and declare that I have embraced CHRISTIANITY and renounced HINDUISM with effect from 1998 February 2nd. I have changed only my religion and not my name"

### వృద్ధులకు పాలు

## బ్రెడ్లు పంపిణీ

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి జన్మదినం సందర్భంగా నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మైనార్టీ నాయకులు ఎస్ మహబూబ్ బాషా, కె వెంకటప్ప, టి ధనుంజయుడు, కె రమేష్, జి రవి, గరిబ్ బాషాలు పాల్గొని పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

# భూ సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించండి

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికంగా భూసమస్యలు, సర్వేలకు సంబంధించి అర్జీలు అధికంగా వస్తున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా త్వరతగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. సోమవారం ఆత్మకూరు ఆర్డిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణయా పాల్గొని ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 125 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కారం చేస్తారనే నమ్మకం ప్రజల్లో కల్పించే అదికారులు పని చేయాలన్నారు. అలాగే కేస్ బై కేస్ అర్జీలను నివృత్తి చేసేలా దృష్టిసారించి, రీ ఓపెన్ చేసిన అర్జీలనుత్వరగాపరిష్కరించాలన్నారు. ప్రజా ఫిర్యాదులకు సంబంధించి ఎక్కువగా బేతంచెర్ల, నంద్యాల రూరల్, రుద్రవరం, బనగానపల్లె, కొత్తపల్లి , జూపాడుబంగ్లా మండలాల్లో ఎక్కువగా ఉన్నాయని , వాటిపై సంబంధిత అధికారులు దృష్టిసారించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నీడ్ బేస్డ్ పై ప్రత్యేక దృష్టి సారిస్తుందని అందులో ఆత్మకూరు, చాగలమర్రి, ప్యాపిలి, డివేములు, కోవెలకుంట్ల, ఆళ్ళగడ్డ, డోన్ మండలాల్లో పురోగతి సాధించారని, అందుకు ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు ప్రత్యేక దృష్టి మంగళవారం నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డిస్క్రిపెన్సి సర్వేను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మార్గదర్శి కుటుంబాలను కూడా త్వరితగతిన నమోదు చేసేలా చూడాలన్నారు. అలాగే వాట్సప్ గవర్నర్స్ మనమిత్రపై ప్రజలక అవగాహన కల్పించేందుకు గ్రామ, మండల, నియోజకవర్గాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు.

## గోనెగండ్ల లో ఎస్సీ, బీసీ హస్టల్ను ఏర్పాటు చేయాలి

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గోనెగండ్లలో ప్రభుత్వం ఎస్సీ, బీసీ బాలుర హస్టల్ను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ తాలుకా ఆధ్యకుడు మునిస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట అరగంట పాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తాలుకా ఆధ్యకుడు మునిస్వామి మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో చదువున్న విద్యార్థులకు ఆట స్థలం లేక ఇబ్బంది పడుతున్నారని అందు చేత ప్రభుత్వం ఆటస్థలం ను ఏర్పాటు చేయాన్నారు. అలాగే గోనెగండ్ల బీసీ బాలికల హాస్టల్లో విద్యార్థులకు సరిపడ గదులు లేక పోవడంతో సమస్యగా ఉందన్నారు. నిత్యవసర వస్తువుల ధర పెరగడంతో ప్రసత్వం విద్యార్థులకు కేటాయిస్తున్న రూ. 50 ఎంతమాత్రమ నం. పోవని తెలిపారు. కావున కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు, విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్ల లేక పోవడం, చాల హాస్టల్ లల్లో మినరల్ వాటర్ప్లాంట్స్ లేక తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సమీర్, అన్వర్, సరేష్, రామకృష్ణ ప్రబాకర్ పాల్గొన్నారు.



# శ్రీ గురు రాఘవేంద్రుడి 354వ సప్తరాత్రోత్సవాలు



ఆరాధనోత్సవాల వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న మఠం పీఠాధిపతి, మఠం అధికారులు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** కలియుగ కామధేను కల్ప వృక్షముగా ప్రసిద్ధి చెందిన శ్రీశ్రీ రాఘవేంద్ర 354వ ఆరాధన సప్త రథోత్సవాలు శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో ఆగస్టు 8నుండి 14వరకు జరగనున్నట్లు తెలిపారు. ఈ సప్తరాత్రోత్సవాల్లోభాగంగా, మఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీఠాధిపతి మాట్లాడుతూ, ఆగస్టు 8వవ తేదిన ధ్వజారోహణతో సప్తరాత్రోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా గోపూజ అశ్వపూజ, లక్ష్మీ పూజ దాన్య పూజ నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 9న శకోత్సవం, ప్రతి దినం నిర్మల విసర్జన సే, సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం మహామంగళహారతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. టీటీడీ దేవస్థానం వారు వస్త్రాలు సమర్పించనున్నారు. ఆరాధన ఉత్సవాలు పురస్కరించుకొని శ్రీ మట్టపు సాంప్రదాయ ప్రకారం వివిధ ధార్మిక అధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు కన్నడ, తెలుగు సాంస్కృత బాషలలో ప్రసిద్ధ విద్వాంసులచే రాఘవేంద్రుడి ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు శ్రీ యేగేంద్ర సభ మండపం నందు వివిధ రంగాల్లో అత్యుత్త మ సేవలందించిన వారికి మఠం అత్యున్నత పురస్కారమైన రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులను ప్రధానం చేస్తారన్నారు. మధ్యారాధన సందర్భంగా రాఘవేంద్ర స్వామికి మహామంగళహారతి, పంచా మృతాభిషేకం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఉత్తరారధన సందర్భంగా మంత్రాలయం పురవీధుల గుండా మహా రథోత్సవం కార్యక్రమం ఉంటుందన్నారు. వసంతోత్సవం కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు సౌకర్యాలు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ క్షేత్రానికి విచ్చేయుచున్న భక్తుల సంఖ్య పెరుగుతున్నది. అందుకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం కోసం నూతనంగా క్యూ కాంప్లెక్స్, వేచి ఉండు గది, ఉపర్తల వంతెన, తదితర ఏర్పాట్లు చేశామన్నారు. తుంగభద్ర నదీలోని ప్రవాహం దృష్టిలో ఉంచుకొని భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి నదీ తీరాన షవర్లు ఏర్పాటు చేశారు. ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలుజరగకుండా ప్రభుత్వ విపత్తు నిర్వాహణ సంస్థ ద్వారా అదనపు సిబ్బందితో సురక్షిత ఏర్పాట్లను అంతేకాకుండా భక్తుల రద్దీని అనుగుణంగా తగినంత పరిమళ ప్రసాదం, భోజన ప్రసాద వితరణ, స్వయంసేవకుల వినియోగం, ప్రథమ చికిత్స కేంద్రంలో , భద్రత ఏర్పాట్లు, పార్కింగ్, పరిశుభ్రత, తదితర ఏర్పాట్లు చేశారు. భక్తులు ఎవరి మాటలు వినకుండా శ్రీ మఠంలోనే అన్ని సేవలు ఉంటాయన్నారు.

# దేవాలయాలపై దాడులకు పాల్పడ్డ వారిని అరెస్టు చేయకపోతే ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం పరిణయ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయాలపై దాడులు చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించకపోతే అక్టోబర్ 2వ తేదీ నుండి ఆందోళనలు చేపడతామని ఆయన తెలిపారు. అమెరికాలో జరగనున్న ఐవిఎల్‌పి సమావేశాలకుభారత్‌నుండిఎంపికైన ఏకైక మహిళా ప్రతినిధి, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూషారెడ్డిని అభినందించిన ఆయన భారత ప్రజాస్వామ్య గొప్పతనాన్ని అమెరికన్లకు సమావేశం వేదికగా వివరించాలని ఆయన సూచించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ ఎప్పుడేమి మాట్లాడతారో, ఎలా వ్యవహరిస్తారో ఆయనకే అర్థం అవుతుందో లేదో తెలియదని ఆయన అన్నారు. తన మనసుకు తోచింది ఏదైనా ఎవరితోనూ చర్చించకుండా ట్రంప్ చర్యలకు దిగుతున్నారని ఆయన చెప్పారు. అమెరికన్ పార్లమెంట్ కంటే మన పార్లమెంట్ బలమైందని ఆయన అభిప్రాయపడ్డారు. మన రాజ్యాంగంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకునేలా చట్టాలను రూపొందించారని ఆయన చెప్పారు. మహిళలకు రాజకీయ రంగంలో ప్రధాని నరేంద్ర మోదీ సముచిత స్థానం ఇస్తున్నారని ఆయన గుర్తు చేశారు. పంచాయితీల్లో మహిళలకు రిజర్వేషన్లున్నా చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు కల్పించాలన్న ఆశ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందని, నరేంద్ర మోదీ ఆ కలను నిజం చేశారని ఆయన చెప్పారు. మహిళలకు సముచిత స్థానం ఇవ్వడంలో భారత ప్రధాని మోదీ తర్వాతే ఎవరైనా అని ఆయన అన్నారు. కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల అంశాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నామని టి.జి.వెంకటేష్ చెప్పారు. కూటమి పాలన బాగుందన్న ఆయన భాజపా రాయలసీమ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉందని చెప్పారు.

# అంతర్జాతీయ విజిటర్ లీడర్‌షిప్‌కు అమెరికాకు వినూషారెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :**

అమెరికాలో ఈ నెల 11వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ విజిటర్ లీడర్‌షిప్ కార్యక్రమానికి భాజపా ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధి డాక్టర్ వినూషారెడ్డి ఎంపికయ్యారు. ఈ బహుళ ప్రాంతీయ సమావేశానికి ప్రపంచ వ్యాప్తంగా 20మంది విశిష్ట మహిళా నాయకురాళ్లను ఎంపిక చేస్తే భారతదేశం నుండి వినూషా ఒక్కరే ఎంపికయ్యారు. రాజకీయాలు, సమాజంలో మహిళల పాత్ర అనే అంశంపై ఈ సమావేశాల్లో విస్తృతంగా చర్చిస్తారు. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్స్ నిర్వహిస్తోన్న ఐవిఎల్‌పి కార్యక్రమం భావి ప్రపం నాయకుల మధ్య పరస్పర అవగాహనకు, భావజాల మార్పిడికి ప్రధాన వేదికగా నిలువబోతోంది. అమెరికా విదేశాంగ శాఖ 1940 సంవత్సరం నుండి ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు భారత్ నుండి వాజ్‌పాయ్, ఇందిరాగాంధీ, ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ తదితర కొద్ది మంది నేతలకే ఐవిఎల్‌పిలో పాల్గొనే అవకాశం లభించింది. అంతర్జాతీయ సమావేశాలకు ఎంపికైన డాక్టర్ వినూషారెడ్డిని రాజ్యసభ మాజీ సభ్యులు టి.జి.వెంకటేష్, ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారధి, భాజపా జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, భాజపా నేతలు పోలంకి రామస్వామి, నగరూరు రాఘవేంద్ర, గీతామాధురి, మాలతి తదితరులు అభినందించారు.

ఐవిఎల్‌పికి ఎంపికైన నేపథ్యంలో సోమవారం కర్నూలులోని పరిణయ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ వినూషారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి అవకాశం తనకు వస్తుందని కలలో కూడా ఊహించలేదని అన్నారు. బ్రిక్స్ సమావేశానికి భారత్ తరపున తాను ప్రాతినిధ్యం వహించినా ఇంతటి పెద్ద అవకాశం భాజపాలో పని చేసిన వారికే దక్కుతుందని అమె చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ మహిళలకు రాజకీయాల్లో సముచిత స్థానం ఇస్తున్నారనేందుకు తానే ఒక మచ్చుతునక అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జపాన్, జర్మనీ, పోలండ్, అర్జెంటీనా, ఉక్రెయిన్, బల్గేరియా, సింగపూర్, లెబనాన్, ఇరాక్, సౌత్‌కొరియా, సౌత్‌ఆఫ్రికా, తైవాన్ తదితర దేశాల నుండి ప్రతినిధులు పాల్గొంటారని ఆమె చెప్పారు. కార్యక్రమంలో అమెరికాలోని చట్టసభల సభ్యులు, విధానపరమైన సంస్థలు, మేధోవర్గం, విశ్వవిద్యాలయాలు, పౌర సమాజ సంస్థలలో విలువైన సమాచార మరియు పాలనకు సంబంధించిన సమాచార మార్పిడికి వీలు కలుగుతుందని ఆమె వివరించారు.

# స్వమిత్వ సర్వేకు ప్రజలు సహకరించాలి

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** ఇంటి కొలతలు, ఇతర వివరాలు సర్వే సిబ్బందికి తెలియజేసి సకాలంలో స్వమిత్వ సర్వే పూర్తి చేయడానికి ప్రజలుసహకరించాలనిడిప్యూటీఎంపీడీఓ తాహీర్‌హుసేన్ అన్నారు. మండలంలోని గొడెగనూరు గ్రామంలో సర్పంచ్ సంజీవరాయుడి అధ్యక్షతన గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల యజమానులను గుర్తించి వారికి హక్కుపత్రాలుఇచ్చేందుకుస్వమిత్వసర్వే నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజలు సహకరించి హద్దులు కచ్చితంగా గుర్తించేలా కృషిచేయాలని ఆయన సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం ఇళ్ల స్థలాల యజమానులకుధృవపత్రాలు అందిస్తామన్నారు. అలాగే మండలంలోని శెట్టివీడు,గొట్లూరు గ్రామాలలో కూడా స్వమిత్వ గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు ఆదినారాయణ, రాజశేఖర్, తహసీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దస్తగిరి,విఆర్ఓలు,సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



సూర్య www.suryaa.com



# శక్తియాప్‌పై విద్యార్థినీలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సిబ్బది

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఉన్నత పాఠశాల, నన్నూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం శక్తి టీం సిబ్బంది, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, విద్యార్థినీల భద్రత కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ ఉపయోగం సేవలు నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ గురించి విద్యార్థినీ, విద్యార్థులకు విస్తృత స్థాయిలో శక్తి టీం బృందం అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు శక్తి యాప్ ద్వారా 100, 112, ఎస్ఓఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. ఆపద సమయంలో అత్యవసర సహాయ మందించేందుకు శక్తి యాప్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు, నన్నూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాలు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి, చెక్కల మద్దిలేటి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, శక్తి టీం సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులకు పదవి నియామకాలు

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు గత నెలలో నిర్వహించిన ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థులు పదవి నియామకాలు చేపట్టారు. సోమవారం పాఠశాల ప్రిన్సిపల్ సుహాసిని ఆద్వర్యంలో చేపట్టిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా పాఠశాలల ఏజిఎం సురేష్, ఆర్ఐ రామాంజనేయులు హాజరయ్యారు. విజయం సాధించిన విద్యార్థులు వారి పదవి బాధ్యతలను ప్రజాస్వామ్య పద్దతిలో చేపట్టారు. ఈ సందర్భంగా ఏజిఎం సురేష్, ఆర్ఐ రామాంజనేయులు, ప్రిన్సిపల్ సుహాసినిలు మాట్లాడుతూ విద్యార్థులు ఈ పదవీ బాధ్యతలతో క్రమశిక్షణగా మెలగడానికి నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని విద్యార్థులు తాము నిర్వహించవలసిన బాధ్యతలను గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, అకాడమిక్ డీన్ హుస్సేన్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





విజయం సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఏజిఎం, ఆర్ఐ

# ఆశ్వం రూపంలో గురు శిష్యులు

- మిఠాయిలు తింటే కోరికలు తీరినట్టే..
- వైభవంగా చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలు
- తంగరడోణలో భక్తజనం
- కిటకిటలాడిన దేవాలయాలు

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని తంగరడోన గ్రామంలో వెలుగొందుతున్నో శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల నామస్మరణములతో వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త పార్వతి పేర్కొన్నారు. స్వామివారి ఆశ్వానికి అడుగడుగున నీరాజనాలతో తంగరడోన గ్రామం భక్తులతో కిటకిటలాడింది. సొమవారం దశమి ఉత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున వేలాది మంది భక్తజనం గ్రామానికి తరలి వచ్చారు. స్వామి వారి ఆలయంలో గంగపూజ, అభిషేకాలు, అనంతరం స్వామి ఆశ్వం, ఓబులేష్, బాలమునిస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో అదీష్టించి నల్లారెడ్డి స్వామి ఆలయానికి మేళతాళాలతో వెళ్లగా, అడుగడుగునా మొక్కులు తీర్చుకున్నారు. నల్లారెడ్డి ఆలయం నుంచి స్వామి ఆశ్వం తిరిగి చింతలాముని స్వామి ఆలయానికి 3గంటలకు చేరుకుంది. స్వామి ఆశ్వానికి భక్తులు కోర్కెలు తీర్చుకోవడానికి మిఠాయిలు, పండ్లు సమర్పించగా, ఆశ్వం తింటే కోరుకున్న కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. స్వామి ఆశ్వానికి అడుగడుగున నీరాజనాలతో తంగరడోణ గ్రామమంతా భక్తులతో కిటకిటలాడింది. ఈ దశమి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచేకాకుండానే తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. దేవాలయాలకు విచ్చేసిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. గ్రామలలో ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలుజరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించినట్లు ఆస్పరి సిఐ మస్తాన్ వలి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పార్వతి, గ్రామ సర్పంచు శంకరమ్మ, ఎంపిటీసీ నరసప్ప, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, శేషప్ప, గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, వెంకన్న, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాబు, మునిస్వామి, పులికొండ రంగన్న, నరసింహారెడ్డి, రాజన్న, జొంపు రంగముని, దస్తగిరి, మునిస్వామి, కృష్ణమూర్తి, వంకటేష్, మల్లేశప్ప, రంగముని, తంగరడోన విఆర్ఓ బి.టి. రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



చింతలాముని స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



నల్లారెడ్డి స్వామికి పూజలుచేస్తున్న దృశ్యం

# బాధ్యతాయుతంగా అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

## – జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందిన ధరఖాస్తులను బాధ్యతాయుతంగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపు హాలులో సోమవారం జెసి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారునికి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని అన్నారు. పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని అన్నారు. అనంతరం డిఆర్ఓ రాము నాయక్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇందులో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పింఛన్ మంజూరు, తదితర సమస్యలపై దాదాపు 289 వినతులను సమర్పించారు. వీటన్నింటిని గడువులోగా పరిష్కరించాలని జెసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భ్రూణ హత్య కేసులో నిందితులు అరెస్టు, రిమాండ్




నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం

**నందికొట్కూరు, మేజర్ న్యూస్ :** భ్రూణ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు నందికొట్కూరు పోలీసులు తెలిపారు. బుధవారం నందికొట్కూరు పోలీసులు కేసు వివరాలను వెల్లడించారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం , బీరవోలు గ్రామానికి చెందిన గుజ్జుల లోకేష్, గుజ్జుల శ్రీవాణి దంపతులు వీరికి ఇదివరకే ఇద్దరు కూతుళ్లు సంతానం, తర్వాత గర్భం దాల్చిన శ్రీవాణి కి భర్త లోకేష్, అతని తల్లి నాగేంద్రమ్మ నందికొట్కూరులోని ఆర్ ఎంపీ డాక్టర్ గీతారాణి సహకారంతో గర్భస్థలింగ నిర్ధారణ చేయించారని గర్భంలో ఆడపిల్ల ఉన్నట్లు నిర్ధారణ చేసుకొని ఆర్ఎంపీ డాక్టర్ సహాయంతో శ్రీవాణి భర్త లోకేష్, అతని తల్లి నాగేంద్రమ్మ ,శ్రీవాణికి గత నెల 29వ తేదీన గీతారాణి క్లినిక్ లో అబార్షన్ చేయించారని ,ఈ అబార్షన్ వికటించి తీవ్ర రక్తస్రావం జరిగి శ్రీవాణి గత నెల 30వ తేదీన మరణించిందని పోలీసులు తెలిపారు. దీనిపై శ్రీవాణి తల్లి శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి నిందితులైన ఆర్ఎంపీ డాక్టర్ గీతారాణి, శ్రీవాణి భర్త లోకేష్, అతని తల్లి నాగేంద్రమ్మలను ఈనెల 3, 4 తేదీలలో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించామని పోలీసులు తెలిపారు. లింగ నిర్ధారణ చేయడానికి సహకరించిన కర్నూలు నగరంలోని రక్ష ఆసుపత్రిలో టెక్నీషియన్ గా పనిచేస్తున్న శేఖర్, రక్ష హాస్పిటల్ యాజమాన్యం ప్రమేయంపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

# యువకుడి మృతదేహం లభ్యం

## ఫలించిన నాలుగు రోజుల పోలీసుల ప్రయత్నం





**బండి ఆత్మకూరు రూరల్ ,మేజర్ న్యూస్ :** గత నాలుగు రోజులగా పోలీసుల చేసిన ప్రయత్నాలతో కుందూ నదిలో కొట్టుకుని పోయిన యువకుడి మృతదేహం ఉయ్యాలవాడ మండలం ఇంజెడు ప్రాంతంలో పోలీసులకు లభ్యమైంది.ఈనెల 1వ తేదీన బండి ఆత్మకూరు చెందిన ముర్తుజావలి హుస్సేన్ (22) స్థానిక దర్గా వద్ద ఆటో క్లీనింగ్ కి వెళ్లాడు. కాలికి ఉన్న చెప్పు నీటిలో కొట్టుకొని పోవడంతో చెప్పు కోసం వెళ్లి కుందూ నదిలో పడి గల్లంతయ్యాడు. మరుసటి రోజు పోలీసులు మృతుని బంధువులు కుందునది వెంట కోవెలకుంట్ల వరకు గాలించిన ఫలితం లేకుండా పోయింది. మరుసటి రోజు కాకనూరు గ్రామం వద్ద శవం నీటిలో కొట్టుకొని వస్తుండగా గమనించిన స్థానికులు పట్టుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. భీమవరం దగ్గర ఎస్సై జగన్మోహన్ గజ ఈతగాళ్లతో పాటు డ్రోన్ కెమెరాలతో, , నందమూరి నగర్ ప్రాంతాలలో కూడా శవం ఆచూకీ కోసం ప్రయత్నాలు చేశారు. ఆదివారం నాడు ఉయ్యాలవాడ ప్రాంతంలో శవం కొట్టుకుపోతూ కనిపించినప్పటికీ కుందునది ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా శవాన్ని పట్టుకునేందుకు ఎవరూ సాహసించలేకపోయారు. ఆదివారం రాత్రి వరకు పోలీసులు వాగు వెంట కోయిలకుంట్ల ఉయ్యాలవాడ గూడూరు తదితర ప్రాంతాలలో కూడా తిరిగి ప్రయత్నాలు చేశారు.గల్లంతయిన శవాన్ని పట్టుకోవడానికి యస్ డి ఆర్ ఎఫ్ బృందాలు కావాలని తహసీల్దారు పద్మావతి జిల్లా అధికారులకు సమాచారం అందించి సోమవారం ఉదయం కర్నూలు నుండి ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలను రప్పించారు. పోలీసులు ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు నదిలో ఉయ్యాలవాడ నుండి గాలింపు చర్యలు చేపట్టగా ఉయ్యాలవాడ,ఇంజెడు, గ్రామాల మధ్య ఉన్న వాగు ప్రాంతంలో నది మధ్యలో ఉన్న జమ్మి గడ్డలో ఉబ్బి ఉన్న శవాన్ని గుర్తించారు. దొరికిన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు.మృతి చెందిన యువకుడు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండటం ,చేతికి వచ్చిన కొడుకు నదిలో కొట్టుకునిపోయి శవం అయి రావడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఆశవాన్ని గుర్తించేందుకు నాలుగు రోజుల పాటు చర్యలు తీసుకున్న ఎస్ఐ జగన్మోహన్, హెడ్ కానిస్టేబుల్ నరసింహులు, కానిస్టేబుళ్ళు మనోహర్, మహబూబ్ వలి, చెంచయ్యలు తీరు పట్ల ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# వార్డు ఇంఛార్జ్‌ల నియామకం




**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగర మున్సిపల్ కార్పొరేషన్ 5వ, 11వ వార్డులకు కర్నూలు నగన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ జిలాని బాష ఇంచార్జ్‌లను నియమిం చారు. 5వ వార్డుకు షబానా బేగం, 11వ వార్డుకు ఎం సుంకన్నలను కాంగ్రెస్ ఇంచార్జ్‌లుగా నియమించినట్లు తెలిపారు. సోమవారం వీరికి సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, రాష్ట్ర ఐఎన్‌టియుసి ఫెడరేషన్ అధ్యక్షుడు ఖాద్రి బాష, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజుద్దీన్, ఐఎన్‌టియుసి సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్, జాన్ సదానందం తదితరులు నియామక పత్రాలు అందచేశారు.

# ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వాడితే.. సంపూర్ణ ఆరోగ్యం

**- నంద్యాల జిల్లా కలెక్టర్ గణియా రాజకుమారి**



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను వాడడం ద్వారా ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని నంద్యాల జిల్లా కలె క్టర్ రాజకుమారి గణియా అన్నారు. సోమవారం ఆత్మకూరు ఆర్డిఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిస్కార వేదికలో పాల్గొనేందుకు వచ్చిన కలెక్టర్ ఘన జీవామృతం వాడి ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయాల కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేడు వ్యవసాయమంటేనే రైతులు అధికంగా రసాయనాలను వాడుతున్నారని అన్నారు. అలాంటి ఎటువంటి రసాయనాలు, పురుగు మందులు వాడకుండా ఆహార ఉత్పత్తులైన కూరగాయలు, ఆకు కూరలు పండించి ప్రజలకు అందించి హర్షనీయమని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం వల్ల భూమి, నీటిని , పర్యావరణానికి ఎలాంటి హాని జరగదని,దీని వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. వీటి వాడకంతో ఆరోగ్యం మెరుగు పడుతుందని అన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని , అధికారులు కూడా ప్రకృతి వ్యవసాయ వ ల్ల కలిగే లాభాల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాను ప్లాస్టిక్ రహితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అందుకు అనుగుణంగా కూరగాయల వి క్రయ దారులు ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నయాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలను పండించి హర్షనీయమని , వారిని అభినందిస్తు కూరగాయలు, ఘనజీవామృతాన్ని కొనుగోలు చేశారు. ఈమె వెంట ఆర్డిఓ నాగజ్యోతి, తహశీల్దార్ రత్నరాధిక, తదితరులు ఉన్నారు.

# రైతన్నల కంట కన్నీరు చూడవద్దు..

**- ఎరువులను అందించి అన్నదాతలను ఆదుకోవాలని జేసీకి వినతి**

**- వైఎస్ఆర్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జడ్పీ ఛైర్మెన్**



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, వైసీపీ నాయకులు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** రైతన్నలకు పంటల సాగుకు సరిపడా ఎరువులను అందించాలని, అన్నదాతల కంట కన్నీరు చూడరాదని, రైతులకు పార్టీలకు అతీతంగా ఎరువులను అందించాలని వైఎస్ఆర్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాష, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డిలు అన్నారు. సోమవారం రైతులకు పార్టీలకు అతీతంగా ఎరువులను అందించి ఆదుకోవాలని వారు జాయింట్ కలెక్టర్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు ఎరువులను పంట సాగుకు సరిపడేంత అందించాలని, గ్రామాల్లో రైతులను విభజించి పార్టీలను ఆపాదించి కేవలం కూటమి ప్రభుత్వ టీడీపీకి చెందిన రైతులుగా భావించిన వారికి మాత్రమే ఎరువులను అందజేస్తూ మిగతా రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎరువుల పంపిణీ కూడా పార్టీ కార్యక్రమంగా చేస్తూసంబంధించిన వారిచే ఎరువులను రైతులకు పంపిణీ చేస్తున్నారని అన్నారు. తగిన సాక్షాధారాలతో జాయింట్ కలెక్టర్‌కు తెలియజేసి రైతన్నలకు ఎరువులు అందించి ఆదుకోవాలని కోరడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా సకాలంలో సంవృద్ధిగా ఎరువులను అందించామని, నేడు సరిపడేంత ఎరువుల నిల్వలు ఉన్నాయని చెబుతున్న అధికారులు రైతులకు ఎందుకు అందించడం లేదో చెప్పాలన్నారు. ఎరువుల కొరతను సృష్టిస్తున్నారని, రైతులకు ఎరువులు అందకపోతే పంట నష్టం సంభవిస్తుందని, రైతన్నలను కష్టాల్లో నెట్టే పరిస్థితి లేకుండా తక్షణమే అధికారులు స్పందించి ప్రతి రైతుకు ఎరువులు అందించి ఆదుకోవాలని కోరారు. రైతులను రైతుల మాదిరే చూడాలని వారికి పార్టీలను ఆపాదించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, గోస్పాడు మాజీ సోసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో ఎరువులను అందించి రైతులను ఆదుకోండి

**- మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** పంటల సాగుకు అవసరమైన ఎరువులను సకాలంలో సరిపడా అందించి అన్నదాతలను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష అన్నారు. సోమవారం స్థానిక వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలో ఎరువుల పంపిణీలో జరుగుతున్న అవకతవకలపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుకు సరిపడా ఎరువులను అందించి అన్నదాతలను ఆదుకోవాలని అన్నారు. రాజకీయాలపైన, ప్రత్యర్థి నేతలపైన దృష్టిపెట్టడం సరికాదని, రైతులపైన దృష్టిసారించి అన్నదాతల కష్టాలను, సమస్యలను తీర్చాలని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నదాతలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సిద్ధమైన రైతన్నలకు సంవృద్ధిగా సాగునీరు అందించలేకపోతున్నారని ఆరోపించారు. ఎరువులను సరిపడా పంపిణీ చేయలేక రైతన్నలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. 40 ఏళ్ళ రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే కష్టాలు తీరుస్తాడని గంపెడాశతో ఉన్న రైతులను కష్టాల్లోకి నెట్టాడని, గతంలో రైతులపై బుల్లెట్ల వర్షం కురిపించారని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ అంటూ మాటల వరకే పరిమితం అయ్యాడని అన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం మూడు నెలలు కావస్తున్నా రైతులు తయనీయ పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు, నష్టాలు, క్షామం తాండవిస్తోందని విమర్శించారు. సకాలంలో వర్షాలు కురిసినా ఎరువుల లభ్యత ఉన్నా కూడా రైతులకు యూరియా పంపిణీ అరకొరగా అందిస్తూ రైతన్నలను కన్నీరు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు, నంద్యాల మండలాల్లో రైతులకు అందించాల్సిన యేరియా ఎరువుల పంపిణీలో టీడీపీ నాయకులు జోక్యంతో రైతులకు అందాల్సిన ఎరువులు టీడీపీ నాయకుల గోడౌన్లకు తరలిపోతున్నాయని, అధికారులు చేయాల్సిన పనులను కూటమి ప్రభుత్వ నేతలు చేస్తూ తమ పార్టీకి చెందిన వారికి మాత్రమే ఎరువులను అందేలా చూస్తున్నారని ఆరోపించారు. గోస్పాడు మండలం సాంబవరం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ దూదేకుల వెంకటరమణ టీడీపీకి చెందిన రైతులకు మాత్రమే దగ్గరుండి ఎరువులను పంపిణీ చేయడం దారుణమని అన్నారు. అలాగే జూలేపల్లి గ్రామంలో పెద్ద సుబ్బారెడ్డి, జిల్లెల్ల గ్రామంలో చంద్రశేఖర్‌రెడ్డిలు, నెహ్రూనగర్‌లో వెలుగొండారెడ్డి, రమణారెడ్డి, చాబోలులో జోజిరెడ్డి, జయచంద్రారెడ్డిలు అనే కూటమి నేతలు టీడీపీకి చెందిన రైతులకు ఎరువులు అందేలా చూస్తున్నారని విమర్శించారు. ఇంకా అనేక గ్రామాలలో ఇలానే జరుగుతుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం షరతులు లేకుండా పథకాలు ఇస్తామని ఇచ్చిన హామీలు ఎక్కడికి పోయాయని ఎద్దేవా చేశారు. నేడు రైతులు యూరియా కొరతతో, సబ్సిడీ లేక, పంట దిగుబడులకు ధరల స్థిరీకరణ లేక అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, రైతుల సమస్యలను, కష్టాలను సంబంధిత అదికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి తీర్చాలని, రైతన్నలకు మంచి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడుకి మంచి మనస్సు ప్రసాదించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, గోస్పాడు మండల సోసైటీ మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, ఎం కృష్ణాపురం సర్పంచ్ కోటిరెడ్డి, నాయకులు శీలం శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సివిల్ కానిస్టేబుల్ ఫలితాలలో సత్తా చాటిన శ్రీలేఖ



తల్లిదండ్రులతో శ్రీలేఖ

**డోన్, మేజర్‌న్యూస్‌:** నంద్యాల జిల్లా, డోన్ నియోజకవర్గం, డోన్ మండల పరిధిలోని ఆవులదొడ్డి గ్రా మానికి చెందిన దేరంగుల నరసింహులు, లక్ష్మిదేవిల దంపతుల కుమార్తె దేరంగుల శ్రీలేఖ మహిళా సివిల్ కానిస్టేబుల్‌గా రెండో ర్యాంక్ సాధించితన సత్తాచాటింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీసు కానిస్టేబుళ్ళ ఫలితాలలో శ్రీలేఖ రెండ ర్యాంక్ సాధించి మహిళా సివిల్ పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా తల్లి దండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. మారుమూల గ్రామంలో జన్మించి, కర్నూలు పట్టణంలోని పాత రెయిన్‌బో ఆసుపత్రి దగ్గర చిరంజీవి పార్క్ వద్ద చికెన్‌షాపును నడుపుకుంటూ పిల్లలను చదివించి, ఉన్నతమైన స్థానాన్ని చేరుకోవడం ఆనందంగా ఉందని విద్యార్థినీ అభినందించారు. డోన్ మండలం, ఆవులదొడ్డి గ్రామంలో విద్యార్థినీ శ్రీలేఖ బంధువులు సంబరాలు చేసుకున్నారు.

# ఎన్‌టీఆర్ సర్కిల్‌ను పరిశీలించిన సోమిశెట్టి



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్ :** కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న ఎన్.టి.ఆర్ సర్కిల్ ను కర్నూలు మునిసిపల్ కార్పోరేషన్ సుందకీరిస్తున్న పనులను సోమవారం ఆయా పనులను కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజి కార్పోరేటర్ గున్నా మార్క్ పరిశీలించారు.కీ,శే, శ్రీ నందమూరి తారకరామారావు విగ్రహం ఇరువైపుల మెట్ల దారి వేసి వాటికి రంగులు వేయడం మరియు విగ్రహ ప్రాంతం మొత్తం శుభ్రం చేసి గడ్డి వేయడాన్ని పరిశీలించి పనుల విషయమై సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# నిషేధిత భూమి సమస్యను పరిష్కరించిన జిల్లా కలెక్టర్

**- కృతజ్ఞతలు తెలిపిన ఎల్. విశ్వనాథరెడ్డి**



కలెక్టర్‌ని కలిసి కృతజ్ఞతలు చెప్పిన విశ్వనాథ్ రెడ్డి

**కర్నూలు, మేజర్ న్యూస్ :**దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న నిషేధిత భూమి సమస్య ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరి ష్కరించారు. ఆదోని మండలం చిన్న గోనే హాల్ కు చెందిన ఎల్. విశ్వనాథరెడ్డి కి సంతేకోడ్లూరు గ్రామ పరిధిలోని 435-ఏ సర్వే నంబర్ లో 1.66 ఎకరాల భూమి ఉంది. ఇతడు తన అవసరాల కోసం 2015 లో తన భూమిని వేరే వారికి విక్రయించారు. భూమిని కొన్నవారు 2018 లో లోన్ కోసం బ్యాంక్‌కు వెళ్లగా, ఈ భూమి నిషేధిత జాబితా లో ఉందని తెలపడంతో భూమి కొన్న వారు విశ్వనాథ్ రెడ్డితో గొడవకు దిగడంతో విశ్వనాథ రెడ్డి డబ్బులు తిరిగి చెల్లించాడు. 435-ఏ సర్వే నంబర్ లో విశ్వనాథరెడ్డి భూమి 1.66 ఎకరాలతో పాటు 0.81 ఎకరాల వాగు పోరంబోకు భూమి కలిసి ఉండడంతో రెండూ కలిపి, మొత్తం 2.47 ఎకరాలను 2016 సంవత్సరంలో 22 ఏ కింద నోటిఫై చేశారు. 2018 నుండి విశ్వనాథ రెడ్డి తన భూమిని నిషేధిత భూముల జాబితా నుండి తొలగించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. చివరకు పిజిఆర్ఎస్ లో ఈ సమస్య జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గారి దృష్టికి రాగా, కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి, విశ్వనాథ రెడ్డి భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి, డీ నోటిఫై చేశారు. సోమవారం విశ్వనాథ రెడ్డి జిల్లా కలెక్టర్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు ఉచిత వైద్య శిబిరం



తిమ్మారెడ్డి, వార్డు ఇంచార్జ్

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ జన్మదినం పురస్కరించుకుని అమీలియో ఆసుపత్రి వారి సౌజన్యంతో నేడు నగరంలోని బాబా బృందావన్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిహిస్తున్నట్లు 42వ వార్డు టిడిపి ఇంచార్జ్ ఎన్ తిమ్మారెడ్డి, టిడిపి నాయకులు డి మధుసుధన్ రెడ్డిలు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సేవ కార్యక్రమాలతో పాటు అందరికి ఆరోగ్యమే మా లక్ష్యం అనే నినాదంతో అమీలియో ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు మంగళవారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు నగరంలోని 42వ వార్డు బాబా బృందావన్ నగర్ పార్కు వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కంటి శుక్లము, గుండె జబ్బులు, గర్భిణీ స్త్రీలు, షుగర్, బి.పి, మోకాళ్ల నొప్పులు, వరిబీజము, హెర్నియా, చెవి, ముక్కు సమస్యలున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని వార్డు ప్రజలతో పాటు ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అవినీతి పై విచారణ జరిపిస్తాం

- రాష్ట్రానికి పట్టిన పెద్ద పీడ వైఎస్ జగన్
- దోపిడీకి గురైన నాడు - నేడు విద్యా వ్యవస్థను మంత్రి నారా లోకేశ్ చక్కబెడుతున్నారు
- ఎమ్మిగనూరుకు రైల్వే లైన్ డీపీఆర్‌కు లైన్ క్లియర్..
- రూ. 200 కోట్లతో బైపాస్ రోడ్డు కూడా ఆమోదం
- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** ఎమ్మిగనూరులో 2008లో ప్రారంభమైన(యూజీడీ) అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపిస్తాం' అని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యాసంస్థలతో పాటు ఎమ్మిగనూరులోనూ ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాలు తగ్గాయంటూ ఓ దినపత్రికలో వచ్చిన అసత్య కథనాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఎమ్మిగనూరులో ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ విద్యార్థులు సంఖ్య గణనీయంగా పెరిగినట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో అస్తవ్యస్తమైన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టారని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడు పేరుతో దోపిడీకి గురైన విద్యావ్యవస్థను సరిచేసుకుంటూ వస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పది సెంట్లు భూమి ఉన్నవారు కూడా అర్హులన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 38 వేల 318మంది రైతులకు నేరుగా రూ.26 కోట్లు అన్నదాతల అకౌంట్లోనే మొదటి విడత నగదు జమ అయ్యిందని వెల్లడించారు. ఇప్పటికే పెన్షన్లు రూ. 3వేల నుంచి రూ. 4వేలకు పెంపు, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం, ఉచిత ఇసుక, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, నేడు రైతన్నలకు అన్నదాత సుఖీభవ పథకం వంటి వాటిని కూడా వైసీపీ పార్టీ చెడుగా చిత్రీకరించడం పరిపాటిగా మారిందన్నారు. వైసీపీ కుతంత్రాలను ప్రజలు ఎవ్వరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. 2008లో ఎమ్మిగనూరులో డ్రైనేజీ పనులకు ప్రభుత్వం రూ.36 కోట్లు విడుదల చేసినా నాటి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పనులు పూర్తి చేయలేక చేతులెత్తేశారని ఎమ్మెల్యే బీవీ ఆరోపించారు. అయితే 2014లో తాను గెలిచాక 95 శాతం డ్రైనేజీ పనులను పూర్తిచేశామని గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో గెలిచిన ఎర్రకోట కేశవరెడ్డి అవే పనులకు మళ్లీ రూ.26 కోట్లు కావాలని నాటి ఆర్థిక మంత్రి బుగ్గనని కోరినా.. ఆనాడు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. తమ హయాంలో డ్రైనేజీ పనులు పూర్తిచేశామని ఇప్పుడు వైసీపీ నేతలు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. వైసీపీ ఇంచార్జ్ బుట్టా రేణుక వర్గం చేస్తున్న ఆరోపణల మేరకే కేశవరెడ్డిపై విచారణ కమిషన్ వేయించడంతో పాటు డ్రైనేజీ పనులు కూడా చేపడతామని బీవీ స్పష్టం చేశారు. మద్యం కుంభకోణంలో అందరి వేళ్లూ తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నాయని పక్కాగా సాక్ష్యాధారాలు సేకరించి ప్రభుత్వం సరైన సమయంలో సరైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మద్యం స్కామ్‌లో ఎవరూ తప్పించుకోలేరన్నారు. అలాగే నా తండ్రి మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డి కల.. ఎమ్మిగనూరు రైల్వే లైన్ డీపీఆర్ కు ఆమోదం అయ్యిందన్నారు. అంతేకాకుండా ఆర్డీఎస్ ప్రాజెక్టును పునః ప్రారంభించడం జరుగుతుందని బీవీ వెల్లడించారు. ఎమ్మిగనూరుకు 200 కోట్లతో బైపాస్ రోడ్డు కూడా ఆమోదం అయినట్లేనని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ కౌన్సిలర్లు, మండల కన్వీనర్ లో, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగా ఎమ్మెల్యే గౌరు చరిత జన్మదిన వేడుకలు





లంచ్ బాక్స్‌ను అందచేస్తున్న గౌరు జనార్ధన్ రెడ్డి, నాయకులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని నాయకులు కేక్‌కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఓర్వకల్లు మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు గోవిందరెడ్డి, బ్రాహ్మణపల్లి, నాగిరెడ్డి, గుట్టపాడు మోహన్‌రెడ్డి, ఓర్వకల్లు లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, కన్నమడకల సుధాకరయ్యల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే తనయుడు, టిడిపి యువ నాయకులు గౌరు జనార్థన్ రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రామంలోని ప్రజలకు లంచ్ బాక్స్, క్యారీ బ్యాగ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ నిరంతరం ప్రజలతో మమేకమై తనదైన శైలిలో పేద ప్రజలకు సేవలు అందిస్తూ పాణ్యం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నాయకురాలు ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి అని కొనియాడారు. హుస్సేనాపురం, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, పాలకొలను, చింతలపల్లె, సోమయాజుల పల్లె, కన్నమడకల గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు ఏసేపు, కొంతలపాడు శ్రీనివాసులు, ఆయా గ్రామాల్లోని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువకులు ఉద్యోగాలు సాధించడం గర్వకారణం

**– యువకులకు ఎమ్మెల్యే అభినందన**




యువకుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండలంలోని యువకులు పోలీస్ ఉద్యోగాలు సాధించడం మండలంలోని ప్రజలకు, వారి తల్లి దండ్రులకు ముఖ్యంగా ఎమ్మెల్యేగా నాకు గర్వకారణమని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని వగరూరు గ్రామానికి చెందిన వీరనాగప్ప కుమారుడు నరసింహులు, ఏపిఎస్పీ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించడంతోపాటు ఎమ్మెల్యే యువకుడిని తమ ఇంటికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. యువకుడి తల్లిదండ్రులు పడిన కష్టానికి కుమారుడు ఉద్యోగం సాధించి ప్రతిఫలం సాధించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం యువకుడి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు పూలమాలలతో, శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోలే మాభాష, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

# వాసవీ మాతకు శిల్పా పూజలు

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని శ్రీ వాసవీ మాత అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోమవారం హాజరయ్యారు. ఆయనకు ఆలయ కమిటీ అధ్యక్షులు లాలం సుధాకర్ ఘనంగా స్వాగతం పలికారు. ఆర్యవైశ్యులు శిల్పాను దుశ్శాలువాలతో సత్కరించి ధన్యవాదాలను తెలియజేశారు. శ్రీశైలం నియోజకవర్గ సమన్వయ కర్త శిల్పా భువనేశ్వర రెడ్డి, మండల అధ్యక్షుడు ఎం. ప్రభాకర్‌రెడ్డి, వైఎస్ ఆర్‌సీపీ నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే శిల్పా

# ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించాలంటే.. రాజకీయాల్లోకి యువత రావాలి..!

**– వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి**



తెర్నేకల్ సురేందర్ రెడ్డిని సన్మానించిన తెర్నేకల్ గ్రామ యువకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే గ్రామస్థాయి నుండి ప్రభుత్వాన్ని ప్రశ్నించే మార్గం ఒక యువతకే ఉందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజకీయాల్లోకి యువత రావాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెర్నేకల్ సురేందర్ రెడ్డికి వైకాపా రాష్ట్ర కార్యదర్శి (కర్నూలు పార్లమెంట్) పదవి చేపట్టిన సందర్భంగా సోమవారం ఆలూరు నియోజకవర్గంలోని దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన యువకులు కర్నూలులోని సురేందర్ రెడ్డి నివాసంలోని కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ విభాగం దేవనకొండ మండల అధ్యక్షులు పులి నరేష్, తెర్నేకల్ యూత్ నాయకులు ఫిలోమిన్, సురేష్, బంకు ఏసేపు, చిన్న నరసింహులు, డేనియల్, లక్ష్మన్న, శేషన్న, డేవిడ్ రాజు, ప్రకాష్‌రాజు, రమేష్, ఈరన్న,రిక్కీ రాజు, శాంతరాజు, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో పరిసరాల పరిశుభ్రత పై కలెక్టర్ హెచ్చరిక

**– కలెక్టరేట్‌లో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై నేటి నుంచి బ్యాన్**

**– మూడుసార్లు మాత్రమే హెచ్చరిక తర్వాత యాక్షన్ తీసుకోవాల్సిందే**



**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కలెక్టరేట్ కార్యాలయాల పరిసరాల్లో పరిశుభ్రత లేకపోవడంపై జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు చెప్పినా టీగ్లాసులు, ప్లేట్లు కింద పడేసిన దృశ్యాలు కనిపిస్తుండటం అధికారుల నిర్లక్ష్యాన్ని చెప్పారు. మనం ఒకరికి ఆదర్శంగా ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేస్తున్నామని అలాంటి సమయంలో కలెక్టరేట్ పరిసరాలు అపరిశుభ్రతను పెంపొందించేలా చేస్తున్న పనులు చాలా అవమానకరమని తెలియజేశారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ పరిసరాల్లో చెత్త వేయకుండా చూడాలని హెచ్‌ఓడిలకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా చెత్త కనిపించినా సంబంధిత అధికారులపై జరిమానాతో పాటు నియమ, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కలెక్టర్ హెచ్చరించారు. అక్టోబరు 2వ తేదీ నుంచి సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేదం అమలులోకి వస్తుందని, ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.

# పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో (పిజిఆర్ఎస్) అధికారుల నిర్లక్ష్యం వద్దని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా వినతుల కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, గురుకుల పాఠశాలల సీట్లు వంటి అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులు ఎంపిడిఓలు, సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సిఎంఓ గ్రీవెన్స్‌కు సంబంధించి ఆదోని ఉప కలెక్టర్ వద్ద 10, కర్నూలు ఆర్డీఓ వద్ద 6, పత్తికొండ ఆర్డీఓ వద్ద 7, కలెక్టరేట్ ఏఓ, సర్వే ఏడి, డిఆర్‌డిఏ పిడి, ఇళ్ల నిర్మాణ పిడి, నీటి పరిపాలన, గ్రామీణ తాగునీటి సంస్థల ఇంజనీర్లు, వక్ఫ్‌బోర్డుల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉందని, ఇవి బియాండ్ ఎస్ఎల్‌లోకి వెళ్లకుండా పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

**– నగరపాలక అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ**



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం చేయొద్దని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని నగరపాలక అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు కమీషనర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఆర్ఓ జునైద్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
మంగళవారం | 05 ఆగస్టు 2025

# కార్యకర్తకు ఆర్థిక సహాయం



**పాములపాడు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోనివెంపెంట గ్రామంలో తెలుగుదేశం కార్యకర్త బోనాల గోపాల్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న సింగపూర్ టేకురి నాగేశ్వరరావు వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం ఆయన తల్లి మాజీ సర్పంచ్ టేకురి రామ సుబ్బమ్మ ద్వారా ఆర్థిక సహాయం చేశారు కార్యకర్తలకు అన్ని విధాలుగా భరోసా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోనపల్లె సత్యరాజ్ డిసి ఆల్ఫ్రెడ్ గాండ్ల భాస్కర్ యువరాజు వినయ్ మొలక నాగరాజు శేషు, శ్యామరాజు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ గా రాందాస్ గౌడ్

**ఎంపిక చేసిన ఎమ్మెల్యే బీవీ**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ గా 4వ వార్డు టీడీపీ కౌన్సిలర్ రాందాస్ గౌడ్‌ను ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వర రెడ్డి ఎంపిక చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి, ఎమ్మిగనూరు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి గురించి కౌన్సిల్ లో మాట్లాడాలని సూచించారు. ఈ మేరకు ఫ్లోర్ లీడర్ ఎంపిక చేసిన ఎమ్మెల్యే బీవీకు రాందాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉప - ఫ్లోర్ లీడర్ 3వ వార్డు టీడీపీ కౌన్సిలర్ స్వాతిని ఎంపిక చేశారు.



కౌన్సిలర్ రాందాస్ గౌడ్

# ఎరువుల సమస్యలపై జెసికి వినతి



జెసికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో ఎరువులపై రైతులు ఎదుర్కొన్న సమస్యలను మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర రెడ్డి జెసివిష్ణుచరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల కలెక్టరేట్ లో స్పందన కార్యక్రమంలో వైకాపా నాయకులతో కలిసి ఆయన నాని అక్కడ చేరుకుని జేసీ విష్ణు చరణ్ కు రైతులు ఎరువులపై ఎదుర్కొంటున్న సమస్యలను జేసీకి వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పి పి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వమిత్వ సర్వేకు ప్రజలు సహకరించాలి

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** ఇంటి కొలతలు, ఇతర వివరాలు సర్వే సిబ్బందికి తెలియజేసి సకాలంలో స్వమిత్వ సర్వే పూర్తి చేయడానికి ప్రజలు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీఓ తాహీర్‌హుసేన్ అన్నారు. మండలంలోని గొడెగనూరు గ్రామంలో సర్పంచ్ సంజీవరాయుడి అధ్యక్షతన గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల యజమానులను గుర్తించి వారికి హక్కు పత్రాలు ఇచ్చేందుకు స్వమిత్వ సర్వే నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజలుసహకరించి హద్దులు కచ్చితంగా గుర్తించేలా కృషిచేయాలని ఆయన సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం ఇళ్ల స్థలాల యజమానులకు ధృవపత్రాలు అందిస్తామన్నారు. అలాగే మండలం లోని శెట్టివీడు,గొట్లూ రు గ్రామాలలో కూడా స్వమిత్వ గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆదినారాయణ,రాజశేఖర్, తహసీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దస్తగిరి,విఆర్‌ఓలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ తాహీర్‌హుసేన్

# గాయత్రీ మాత అమ్మవారికి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని గాయత్రి నగర్ లో వెలిసిన గాయత్రి మాత అమ్మవారికి సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయం నుండి ఊరేగింపుగా వకులా నది వరకు, అక్కడి నుండి తిరిగి ఆలయం వరకు మేళ తాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట జరిగిన కోలాటం కార్యక్రమం చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వేద పండితులు దక్షిణామూర్తి, బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి సుబ్బారావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు నాగ మోహన్ రావు, రఘు, పద్మనాభరావు, కిరణ్, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# గంజహళ్లిలో చిరుత సంచారం పై ఫారెస్టు అధికారులు ఆరా..

**- సీసీ కెమరాలు ఏర్పాటు చేస్తాం**




**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండలంలోని గంజహళ్లి, ఎన్నెకండ్ల, గ్రామాలలో పంటపొలాలలో చిరుత సంచరించినట్లు ఆయా గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆదోని ఫారెస్టు రేం జాఫీసర్ తేజశ్వని, డిప్యూటీ రేంజ్లఫీసర్ నూర్జహన్, బీట్ ఆఫీసర్ రవికుమార్ గంజహళ్లి గ్రామంలో విచారణ చేపట్టారు. చిరుత వచ్చిందా లేకమరో జంతువు ఏదైనా సంచరిం చిందా అని పొలాలలోని వాటి పాదముద్రలను పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామ సర్పంచ్ రాముడు, గ్రామ ప్రజలు మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం దన్నపోతును చంపి వేసిందని కళేభరం దగ్గరకు వచ్చి మాంసంను తిన్నట్లు వారు తెలిపారు. గత నాలుగురోజుల క్రితం కూడా పంటపొలాలలో పనులు చేస్తున్న రైతులకు చిరుత కనిపించిందని గ్రామస్థులు అధికారులకు వివరించారు. అనంతరం ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ తేజశ్వని మాట్లాడుతూ చిరుత సంచరించిందన్నా ప్రాంతంలో సీసీ కెమరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే చిరుత నా లేక హైనానా, తోడేలా అన్నది నిర్ధారణ అయ్యేవరకు పంట పోలాలకు ఒక్కరుగా వెళ్ల వద్దన్నారు. పిల్లలను, మహిళలను పొలం వైపు తీసుకువెళ్ల వద్దని రైతులకు కోరారు. అలాగే చిరుత పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వారికి వివరించారు. రాత్రి పూట గ్రామాలలోకి వస్తే మా పరస్థితి ఏమిటని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తుశారు. పంట పొలాలకు మహిళలు, పిల్లలు ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నారని పెద్దవారు కూడా గుంపులు గా వెళ్లాల్సి వస్తుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అతి త్వరలో సీసీ కెమరాలు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరింస్తామ ఫారెస్టు అధికారులు ప్రజలకు హామీ ఇచ్చారు.

# మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభించిన బి.సి రాజారెడ్డి

**- ప్రభుత్వ హాస్టల్‌లలో వాటర్‌ప్లాంట్‌ల ఏర్పాటు**
**- విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే లక్ష్యం**

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** విద్యా వ్యవస్థ బలంగా ఉంటేనే సమాజంలో మార్పు వస్తుందని బనగానపల్లె మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణం రవ్వలకొండలో మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, బి.సి హాస్టళ్లలో బి.సి రాజారెడ్డి తన సొంత ఖర్చులతో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. సోమవారంనాడు పాఠశాలకు చేరుకున్న బి.సి రాజారెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బి.సి రాజారెడ్డి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఉపాధ్యాయ సిబ్బంది పిలుపు మేరకు హాస్టళ్లలో మినరల్ వాటర్‌ప్లాంట్ల్ ఏర్పాటు చేశామన్నారు. తమ తల్లిదండ్రులు కీ.శే. బి.సి గుర్రెడ్డి, లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం ప్రభుత్వ హాస్టల్‌లలో 1000లీటర్ల సామర్థ్యంతో ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని హాస్టళ్లకు ఫోన్‌లు తీసుకురావద్దని ఫోన్‌లకు బానిసై విలువైన సమయాన్ని వృధాచేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా విద్యాలయం ఎస్.ఒ సునిత, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బాలాజి, వార్డెన్ నాగేంద్ర పాల్గొన్నారు.



మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న బి.సి రాజారెడ్డి

# అధిక ఆదాయం కలిగించే ఆయిల్ పామ్ పంటను సాగు చేయండి

**కర్నూలు, మేజర్‌న్యూస్ ః** జిల్లాకి నిర్దేశించిన ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఆయిల్ పామ్ సాగుకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26సంవత్సరానికి కర్నూలు జిల్లాకు 550హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్దేశించబడినదని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆదేశాలను ఆదేశించారు. రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేసి లాభాలలోకి వెళ్లాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతికూల వాతావరణంలో కూడ రైతులను ఆదుకునే పంట ఆయిల్‌పామ్ పంట అన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని, రైతులకు ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ (ఎన్.ఎమ్.ఈ.ఒ)ఆయిల్ పామ్ పథకం కింద కర్నూలు జిల్లాలో కర్నూలు, క్రిష్ణగిరి, సి. బెళగల్, కౌతాళం, ఆదోని, హొళగుంద, మంత్రాలయం, పెద్దకడుబూరు, కోసిగి, నందవరం, ఎమ్మిగనూరు, హాలహర్వి, గోనెగండ్లలాంటి 13మండలాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపిక చేయబడిన 13 మండలాల్లోని నీటి వసతి కలిగిన రైతులు ఈ పథకానికి అర్హులని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం ద్వార రైతులకు వందశాతం రాయితీతో మొక్కలను అందిస్తామన్నారు. అలాగే నాలుగేళ్ల నిర్వహణ కొరకు ప్రతి ఏడాది రూ.5250, మరియు అంతర్ పంట ప్రోత్సాహకానికి ప్రతి ఏడాది రూ.5250లు నాలుగేళ్ల వరకు రైతులకు ప్రభుత్వం ద్వారా అందించబడుతుందన్నారు. రైతులు పండించిన పంటను కంపెనీల ద్వారా కొనుగోలు చేయడం ఆయిల్ పామ్ పంట అధిక ఆదాయాన్ని కలిగించే పంట అని, రైతులు ఈ పంటను పెద్ద ఎత్తున సాగు చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెసి డా.బి నవ్య, డిఆర్‌ఓ సి వెంకట నారాయణమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, ఏపిఎంఐపి పథక సంచాలకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నాడు ఎన్‌టిఆర్-నేడు చంద్రబాబునాయుడు

**- 2రూపాయల కిలో బియ్యంతో పేదల ఆకలి తీర్చిన ఎన్‌టిఆర్**
**- అన్నక్యాంటీన్‌తో పేదల ఆకలి తీరుస్తున్న చంద్రబాబు**
**- కోసిగిలో అన్నక్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ**
**- తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి రాఘవేంద్రరెడ్డి**

**కోసిగి మేజర్ న్యూస్:** నాడు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పేదల ఆకలిని గుర్తించి 2రూపాయలకే కిలో బియ్యాన్ని అందించి పేదల ఆకలి తీర్చిన ఘనుడని అలాగే నేడు అన్న క్యాంటిన్‌తో 5రూపాయలకే భోజనం అందించి పేదల ఆకలిని తీరుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి రాఘవేంధ్రరెడ్డి అన్నారు. సోమవారం సంతమార్కెట్‌లో అన్న క్యాంటిన్ నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పేదల ఆకలిని గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు, కూటమి ప్రభుత్వం అన్న క్యాంటిన్‌ను ఏర్పాటుచేస్తుందన్నారు. ఈ అన్న క్యాంటిన్ వల్ల పేదవాళ్ళ ఆకలి తీరుస్తుందని ఒక్కపూటైనా పేదలు అన్నం తింటారని చెప్పడం జరిగింది. అలాగే కోసిగిలో సంతమార్కెట్‌తోపాటు, ప్రభుత్వాసుపత్రి వివిధ రకాలుగా ప్రజలు కోసిగికి రావడం జరుగుతుందని అలాంట వారికి అన్న క్యాంటిన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గతంలో తెలుగుదేశంపార్టీ అన్న క్యాంటిన్‌లను కొసాగిస్తే వైసిపి ప్రభుత్వం అన్నక్యాంటిన్‌లు తొలగించి పేదల కడుపు కొట్టారన్నారు. ముఖ్యంగా కోసిగిని అన్నిరంగాలలో అభివృద్ది చేసేందుకు అన్న క్యాంటిన్‌ను చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటి ధరల ప్రకారంగా చూస్తే 5రూపాయలకు భోజనం ఇవ్వడం నారా చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దీనితోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కూటమిప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, రమాకాంత్‌రెడ్డి, సర్పంచ్ అయ్యమ్మ, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్‌నాయుడు, అయ్యన్న, వక్రాణివెంకటేషులు, జక్కనిగేని వెంకటేసులు, హొళగుంద కోసిగియ్య, మాణిక్యరాజు, మాలప్ప లక్ష్మయ్య, జ్ఞానేష్, రాజేష్, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఓ విశ్వేశరయ్య, సిఐ మంజునాథ్, హనుమంతరెడ్డి, సొట్టయ్య, సాతనూరు కోసిగయ్య పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న టిడిపి ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

# బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఫయాజ్

**అభినందించి సత్కరించిన నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్**

**క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన క్రీడలలో విజయానికి దోహదపడతాయి: డాక్టర్ రవి కృష్ణ**




**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :**నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్ ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ ఎన్నికలలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంజరిగింది. ఈ సందర్భంగా సోమవారం నంద్యాల మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ అలీ హుస్సేన్ నిర్వహణలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఫయాజ్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ, నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఏర్పడిన తర్వాత జిల్లాలో బాక్సింగ్ అభివృద్ధికి కృషి చేసిన ఫయాజ్ బాక్సింగ్ రాష్ట్ర సంఘం కార్యవర్గానికి ఎన్నిక కావడం అభినందించదగ్గ విషయం అన్నారు. నంద్యాలలో బాక్సింగ్ అభివృద్ధికి శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి సహకరిస్తామన్నారు. ఫయాజ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా నుండి రాష్ట్ర జాతీయ బాక్సింగ్ క్రీడాకారులను తయారు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ అలీ హుస్సేన్, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, నంద్యాల బాక్సింగ్ ఇంచార్జ్ సర్దార్, బనగానపల్లె బాక్సింగ్ కోచ్ లు చంద్ర మహబూబ్ బాషా, ఆత్మకూరు ఇంచార్జ్ ఉపేంద్ర, అసోసియేషన్ సభ్యులు మద్దిలేటి, ప్రసాద్ ,జస్వంత్, షా నవాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# శాంతినగర్ కాదు.. శాంతి నిలయం

**పాములపాడు,మేజర్‌న్యూస్ :**

పాములపాడు మండల పరిధిలోని ఎర్రగుడూరు గ్రామం వద్ద జాతీయ రహదారి 340 సి నిర్మా ణంలో ఎర్రగుడూరు గ్రామం వద్ద ఏర్పాటుచేసిన బోర్డులో శాంతి నిలయంకు బదులుగా శాంతినగర్ అని జాతీయ రహదారి అధికారులు బోర్డుతప్పుగాఏర్పాటుచేశారు. దీంతో దూరం నుంచి ఆ గ్రామానికి వెళ్లే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది నేషనల్ హైవే అధికారులు స్పం దించి ఆ బోర్డును మార్చాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.




నేషనల్ హైవే అధికారులుతప్పుగా ఏర్పాటు చేసిన బోర్డు

# టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం



ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** టీడీపీపాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అని టీడీపీ సీనియర్ నాయకులు రంగన్న బూత్ కన్వీనర్ వాల్మీకి రామనాయుడు అన్నారు. సోమవారం మండల పరిధిలోని అ గ్రహ రం గ్రామంలో వారు టీడీపీ నాయకులను కలుపుకొని సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ ఎర్పడిన ఏడాది కాలంలో అభివృద్ధి పనులు ఏమి జరిగాయి. ఇంకా ఎమి జరుగుతాయో ప్రజలకు వివరించారు. ఏడాది కాలంలో గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాలలో రూ. 4.65 కోట్లతో సీసీ రోడ్డు, డ్రైనేజి ఏర్పాట చేశారని తెలిపారు. మండలం లోని ప్రతి గ్రామంలో టీడీపీ బలమైన కార్యకర్తలను కలిగి ఉన్నారని వచ్చే స్థానిక ఎన్నికలలోపు మండలంలోని అన్ని గ్రామాలలో పార్టీని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకారంతో మరింత బలపడుతుదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కురువ గోవిందు, తిరసమల నాయుడు, చంద్రన్న, కృష్ణయ్య, పరమేష్ టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చట్టసభల్లో యాదవులకు రిజర్వేషన్లు కల్పించాలి

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః**

చట్టసభల్లో యాదవులకు రిజర్వేషన్లు కల్పించాలని అఖిల భారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య యాదవ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు చల్లా బాలస్వామి యాదవ్‌లు పాల్గొన్నారు. సోమవారం మండలంలోని చెరువుపల్లె గ్రామంలో యాదవ సంఘం సమావేశం నిర్వహించి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అద్యక్షులు నాగయ్య యాదవ్, అద్యక్షునిగా మద్దిలేటి యాదవ్, ఉపాధ్యక్షులుగా రవి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రమేష్ యాదవ్, కార్యదర్శిగా కోణ రవి యాదవ్, ట్రెజరర్‌గా తానం నాగేంద్ర యాదవ్, కమిటీ సభ్యులు వెంకటసుబ్బయ్య యాదవ్, గంగరాజు యాదవ్, సీతారామయ్య యాదవ్, బాలశేఖర్ యాదవ్, చంద్రబాబు యాదవ్, రామ్మోహన్ యాదవ్, బాల ఉసేనయ్య యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ మండల కార్యదర్శి రాళ్లకొత్తూరు శంకర్ యాదవ్, ఉపాధ్యక్షులు బాల వెంకటేశ్వర్లు యాదవ్, ఎస్.ఐ.సి శివరాములు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చల్లా బాలస్వామి యాదవ్

# శ్రీ బాలాజీ స్వీట్ షాపును ప్రారంభించిన బి.సి ఇందిరమ్మ

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలోని శ్రీ బాలాజి స్వీట్ షాపు ప్రారంభోత్స వానికిరాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ ముఖ్య అతిధిగాహాజరై ప్రారంభించారు. వారికి షాపు యజమానులు పుష్పగుచ్ఛంతో స్వాగ తం పలికారు. ఈ సందర్భంగా బి.సి ఇందిరమ్మ మాట్లా డుతూ బాలాజి స్వీట్‌షాపు యజమా నులకు అభినందనలు తెలిపారు. బనగానపల్లె ప్రజల కు అందమైన స్వీట్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాపు నిర్వాహకులు , స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్‌చేస్తున్న బి.సి ఇందిరమ్మ

# కోవెలకుంట్లలో భారీ వర్షం

**– లోతట్టు ప్రాంతాలు జలమయం – బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీరు**

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్లలో ఆదివారం రాత్రి నుంచి ఏకదాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోవెలకుంట్లలో 67.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. నిత్యం వందలాది మందితో రద్దీగా ఉండే కోవెలకుంట్ల బస్టాండ్ ఆవరణం చుట్టూ తగ్గు ఉండటంతో వర్షపు నీరు చేరి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్ ఇన్ గేటు, అవుట్ గేట్‌లలో భారీగా వర్షపునీరు నిలిచి ఉండటంతో ప్రయాణీకులు బస్టాండ్‌కు వెళ్లేందుకు కూడా అవస్థలు పడ్డారు. కోవెలకుంట్లలోని జగనన్న కాలనీలో రోడ్లపైనే నీరు నిలచడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీరు

## పేదల పక్షనా సీపీఐ నిరంతర పోరాటం

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** నిరుపేదల పక్షనా సీపీఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ సీనియర్ నాయకులు మద్దిలేటినాయుడు, తాలుకా రైతు సంఘం అధ్యక్షుడు కటికేమాలిక్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో సీపీఐ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ, రైతుసంఘం, నాయకులు మాట్లాడుతూ సీపీఐ పార్టీ పేదల పక్షాన నిలబడి వారి ఉన్నతికి నిరంతరం పాటు పడుతుందని తెలిపారు. 24వ జిల్లా మహాసభలను ఆగష్టు 9,10,11 తేదీలలో న కర్నూలు నందు జరపతలపెట్టినట్లు వారు తెలిపారు. అందుకు సంబందించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. సీపీఐ పార్టీ 1925 న ఆవిర్భవించిందని తెలిపారు.

# పీ–4 సర్వేను వేగవంతం చేయండి

**– ఎంపీడీవో తగు సూచనలు**

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ–4 సర్వేను, నీడ్ సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సంబంధిత సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని బోయరేవుల గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సందర్శించారు. సచివాలయ సిబ్బందికి పీ–4 సర్వే, నీడ్ సర్వేలపై తగు సూచనలను తెలియజేస్తూ సర్వేలను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

# ఘనంగా శ్రీ వాల్మీకి మహర్షి భక్త కనకదాసు విగ్రహా ప్రతిష్ఠాపన కార్యక్రమం

**ప్రతి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహాలు ఏర్పాటు**

**వాల్మీకులారా రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యం కండి**

**వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించే వరకు నిరంతరం రాజీలేని పోరాటం చేస్తాం**

**రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు, మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జ్ వాల్మీకి బి లక్ష్మన్న.**



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడబూరు మండలం ముచ్చిగేరిగ్రామంలో సోమవారము శ్రీవాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహంప్రతిష్టాపనతో పాటుశ్రీకనకదాస్‌స్వామి విగ్రహ ప్రతిష్టాపన కూడా ఘనంగాజరిగింది. ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు, మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జి వాల్మీకి బి లక్ష్మన్న, మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి, టిడిపి రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్. రమాకాంత్ రెడ్డి,బిజెపి మంత్రాలయంఇంచార్జ్ ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ బసల దొడ్డి ఈరన్న, మాజీ సర్పంచ్ నాగేష్, టిడిపి నాయకుడు మల్లికార్జున గౌడ్, టిడిపి యువ నాయకుడు ఎన్ రాకేష్ రెడ్డి, బెలగల్లు వెంకటేష్, డీలర్ ఈరన్న, ఆయుర్వేద ఎముకల డాక్టర్ పర్సప్ప, మొదలగు నాయకులు హాజరై శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను, శ్రీ కనక దాస్ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఘనంగా విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయపోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు, మంత్రాలయం జనసేనపార్టీ ఇంచార్జ్ వాల్మీకి బీలక్ష్మన్న మాట్లాడుతూదాదాపు 40 ఏళ్ల క్రితం వాల్మీకి బోయ సంఘాన్ని స్థాపించి ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పటి నుంచి కూడా రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకి బోయల సింహ గర్జనలు, వాల్మీకి బోయల మహాసభలు, గ్రామ గ్రామాన వాల్మీకి బోయల చైతన్య సభలు చేసి రాష్ట్రంలోని వాల్మీకులందరినీ చైతన్యవంతం చేయడం జరిగిందని అందులో భాగంగానే ఇప్పుడు గ్రామ గ్రామాన శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. అలాగే వాల్మీకుల బోయల ఏకైక డిమాండ్, ప్రధానమైన డిమాండ్ రాష్ట్రంలో ఉన్న వాల్మీకి బోయలందరినీ ఎస్టీలుగా గుర్తించుటయే మా ఏకైక డిమాండ్ అని అన్నారు. ఇది రాజీలేని పోరాటమని వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించేంతవరకు నిరంతరం పోరాటంచేస్తూనే ఉంటామనివాల్మీకిబి.లక్ష్మణ తెలిపారు. గత ప్రభుత్వాలు వాల్మీకిల యొక్క నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని ఎన్నికల సమయంలో వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తిస్తామని హామీలు ఇస్తూ తదనంతరం వాల్మీకి బోయలను విస్మరిస్తూ వస్తున్నారని వాల్మీకి బి లక్ష్మణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతంరాజకీయ పార్టీలకు అతీతంగా వాల్మీకులందరూ ఐకమత్యంతో పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు వాల్మీకి బి లక్ష్మణ తెలిపారు. ఇంకా మూడున్నర సంవత్సరాలు ఎన్డీఏ కూటమిప్రభుత్వం ఉంటుంది కనుక రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ డబల్ ఇంజన్ సర్కార్ వుంది కనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కే పవన్ కళ్యాణ్, రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇద్దరూ కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ఒక్క మాట చెబితే 50 లక్షల మంది వాల్మీకి బోయల జీవితాలు బాగుపడతాయనివాల్మీకి బి లక్ష్మణ తెలిపారు. రాష్ట్రంలో వాల్మీకి బోయలు విద్యా, ఉద్యోగ,సామాజిక,ఆర్థిక, రాజకీయ రంగాలలో చాలా వెనకబడి ఉన్నారని ఇప్పటికీ నిరక్షరాస్యులుగా లక్షల్లో ఉన్నారని అధిక సంఖ్యకులు నిరక్షరాసులేనని లక్ష్మన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలకు వాల్మీకి బోయ నాయకులు కార్యకర్తలు, కురుబ కుల నాయకులు, కార్యకర్తలు ముచ్చగిరి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలను విజయవంతంచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్. హను మంతు. మాజీ డీలర్ నాగప్ప. నాగేష్. బెల్లంఈరన్న. దస్తగిరి. కురువ రామన్న. వెంకటేష్. గ్రామ స్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com

మంగళవారం | 05 ఆగస్టు 2025

# మా పొలం ఇప్పించాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

**– ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్న తలారిపై చర్యలు తీసుకోండి**

**– కలెక్టర్‌ను వేడుకున్న మహిళ రైతు ఆళ్ళ సుభద్రమ్మ**



పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జిని ఇస్తున్న మహిళ రైతు ఆళ్ళ సుభద్రమ్మ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఓ చిరు ఉద్యోగి నాపొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి సాగుచేస్తున్నాడని, ఇదేమి అని అడిగితే తీవ్రభయ భ్రాంతులకు గురిచేస్తు ఇబ్బందులు పెడుతున్నాడని, నా పొలాన్ని నాకిప్పించి దౌర్జన్యానికి పాల్పడుతున్న గ్రామ తలారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళ రైతు సుభద్రమ్మ కలెక్టర్ రాజకుమారి గణియాకు విన్నవించుకున్నారు. సోమవారం ఆత్మకూరు ఆర్డిఓ కార్యాయలంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న కలెక్టర్‌కు మిదుతూరు మండలం చెరుకుచెర్ల గ్రామానికి చెందిన సుభద్రమ్మ అనే మహిల రైతు ఫిర్యాదు చేశారు. చెరుకుచెర్ల గ్రామంలో సర్వేనంబర్ 34లో 90 సెంట్ల భూమి తన భర్త వెంకటేశ్వర్లు పేరు పై ఉందన్నారు. తన భర్త చనిపోవడంతో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న తన భర్త తమ్ముడైన ఆళ్ళ గాంధి సర్వేనంబర్ మార్చుచేసి తనపేరుపైకి ఆన్‌లైన్ చేసుకొని దౌర్జన్యంగా ఆక్రమించారని తెలిపారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆన్‌లైన్‌లో తిరిగి నాపేరుమీదికి ఎక్కించడం జరిగిందని తెలిపారు. అయితే ఆన్‌లైన్ అయినప్పటికి తిరిగి నాపొలాన్ని దున్ని సాగుచేస్తు పొలం వద్దకు రానివ్వడం లేదని, దీంతో పోలీసు స్టేషన్‌ను సంప్రదించినట్లు తెలిపారు . పోలీసు అధికారులు తహశీల్దార్‌కు దీనికి సంబంధించిన రిపోర్టును ఇవ్వాల్సిందిగా కోరినా ఇంత వరకు ఇవ్వలేదని మీరే తనకు న్యాయం చేయాలని తన గోడును విన్నవించుకుంది. దీంతో స్పందించిన కలెక్టర్ సంబంధిత తహశీల్దార్‌కు అర్జీని పంపించి తక్షణ చర్యలు తీసుకొనేలా చూస్తానని అన్నారు.

# బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ వేగంగా పూర్తి చేయండి

- **మూడు మండలాలు మినహా అన్ని చోట్లా వెనుకబడ్డారు**
- **వెనుక బడ్డ వారికి షోకాజ్ నోటీసులివ్వండి**
- **జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



**కర్నూలు, మేజర్ న్యూస్ :** బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎంపిడిఓ లను ఆదేశించారు.సోమవారం సాయంత్రం పి4 అంశం పై కలెక్టర్ మండల స్పెషల్ అధికారులతో, మున్సిపల్ కమిషనర్ లతో, ఎంపిడిఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని మండలాల్లో పి4 కింద పెండింగ్ లో ఉన్న బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.లక్ష్యం మేరకు దత్తత ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అనంతరం అన్ని మండలాల ఎంపిడిఓ లతో సమీక్షిస్తూ పెండింగ్ లో ఉన్న బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ త్వరి తగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం చారు. ఒకవేళ ఏమైనా సాంకేతిక సమస్య లు ఉంటే సిపిఓ తో మాట్లాడి పరిష్కరిం చుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.బంగారు కుటుంబాలకు ఏమేమి అవసరాలు ఉన్నాయి అని చేసే నీడ్ అసెస్మెంట్ సర్వే అంశం పై మండలాల వారీగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.. ఎమ్మిగనూరు, ఓర్వకల్లు, హోలహర్వి మండలాలు తప్ప మిగిలిన మండలాలు అన్నీ వెనుకబడ్డాయని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదోని 1 శాతం చేశారని, కోసిగి, మంత్రాలయం, సి.బెలగల్, దేవనకొండ లాంటి మండలాలు సర్వేలో పురోగతి సాధించలేదని, వెనుకబడిన మండలాల అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ ఆర్డీఓలు ఎంపిడిఓ లతో సమీక్ష నిర్వహించి రెండు రోజుల్లోపు పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు..అదే విధంగా పిజిఆర్ఎస్, ఇతర రెవెన్యూ అంశాలు, పి 4 సర్వే పై ప్రతి రోజు ఎంపిడిఓలు, తహసీల్దార్ లతో సమీక్ష నిర్వహించి రిపోర్ట్ పంపాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు , పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు.టెలి కాన్ఫరెన్స్ లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు..

# ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం

## - రాష్ట్ర మంత్రి టి.జి భరత్



**కర్నూలు, మేజర్ న్యూస్ :** ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 22వ వార్డు అరోరా నగర్‌లో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఏ ఏ పథకాలు అందాయని అడిగి వివరాలు తెలుసుకున్నారు. తల్లికి వందనం డబ్బులు తల్లుల అకౌంట్లో జమ చేశామని, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. అర్హులందరికీ పింఛన్లు 1వ తేదీనే అందిస్తున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల కోసం అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తామని చెప్పారు. తమ ప్రభుత్వంలో జరుగుతున్న మంచి పనుల వల్ల ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని మంత్రి అన్నారు. తమ ప్రభుత్వం మరో రెండు దశాబ్దాల పాటు ఇలాగే కొనసాగితే రాష్ట్రం అభివృద్ధిలో ముందుంటుందన్నారు.

# ప్రజా ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలి

## – అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదులను విచారణ జరిపి వేగవంతంగా పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా అన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్‌ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 104ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐలు పాల్గొన్నారు.



ప్రజా ఫిర్యాదులు తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా

# అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వండి

## - రాష్ట్ర మంత్రి టీజీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్ న్యూస్ :** కర్నూలు నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. నగ రంలోని స్టేట్ గెస్ట్ హౌస్ లో ఆయన రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో అర్హులకు ఇళ్ల పట్టాలు ఇళ్ల స్థలాల విషయంపై చర్చించారు. అమీర్ హైదర్ ఖాన్ నగర్, కారల్ మా ర్క్స్ నగర్, బుధవారం పేట, జగన్నాథ గట్టుపై టిడ్కో ఇళ్లతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఇళ్ల పట్టాలు లేనిచో వారికి పట్టాలు ఇచ్చే విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. కర్నూల్లో ఇళ్ల పట్టాల సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ క్వార్టర్స్ గురించి ఆరా తీశారు ఖాళీగా ఉన్న వాటిని ఇతరులు ఆక్రమించకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, కర్నూల్ రూరల్ ఎమ్మార్వో రమేష్ బాబు, అర్బన్ ఎమ్మార్వో రవికుమార్, కల్లూరు ఎమ్మార్వో ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు

# భారీ వర్షం గ్రామం జలమయం



జలమయమైన గ్రామం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని లొద్దిపల్లె గ్రామంలో సోమవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి గ్రామం జలమయమైంది. ఒకరోజు కురిసిన వర్షానికే వర్షపునీరు గ్రామంలోని వీధుల్లో చేరి వాగులా ప్రవహించి లోతట్టు ఇల్లు వర్షపునీటితో నిండిపోయాయి. దీంతో పాఠశాలకు సెలవు ప్రకటించారు. వర్షం ఇలాగే కురిస్తే గ్రామంలో నష్టం జరిగే అవకాశం ఉందని ఈ విషయమై సంబంధిత అధికారులు గ్రామాన్ని పరిశీలించి లోతట్టు వీధుల్లో తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. నన్నూరు గ్రామంలోని మీదివేములకు వెళ్లే రహదారి వంక మల్లేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

# ఉయ్యాలవాడ ఎస్ఐగా రామిరెడ్డి



**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** ఉయ్యాలవాడ ఎస్ఐగా సీ.రామిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ బీటీ వెంకటేశ్వర్లు కర్నూలు సీఐడీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్‌కు రామిరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఏలాంటి సమస్యలు ఉన్నా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే ప్రస్తుత సమాజంలో విస్తరిస్తున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

# కొత్తూరు సుబ్బరాయుడికి రూ.1.50 లక్షలు విరాళం



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** పాణ్యం మండలంలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు రూ.1.50 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన నాగప్రసాద్, వారి కుటుంబ సభ్యులు కార్తీక మాసములో వారి కుటుంబ సభ్యుల పేరున అన్నదానము నిర్వహించేందుకు రూ. 1 లక్ష, కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన కమలాపురం వెంకటేష్ కుమారుడు అవినాష్, వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ. 50 వేలు విరాళంగా సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదము వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.